

# హైదరాబాద్ వార్త

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు

అల్వాల్, డిసెంబరు 10 ప్రభాతవార్త: దైవ దర్శనానికి కుటుంబ సభ్యులతో వెళ్ళి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. మృతి చెందిన వ్యక్తి ఆర్టీసీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సింగాయిపల్లికి చెందిన వెంకటేష్(43) హకీంపేట్ డిపోలో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి మునిరాబాద్ సమీపంలోని లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం దర్శనానికి వెళ్ళి తిరిగి వస్తుండగా హకీంపేట్ డిపో వద్ద ఆర్టీసి బస్సు ఢీకొట్టింది. కారు నడుపుతున్న వెంకటేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించగా ముగ్గురు మహిళలు కవిత నిర్మల సావిత్రితో పాటుగా చిన్నారులు యశ్వర్ధన్ మోక్షిత్ శషాంక్ గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని అల్వాల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వైద్య పరీక్షలు కోసం తరలించడం జరిగింది. ఇదిలా ఉండగా తాను పని చేసే డిపో వద్దే వెంకటేష్ ప్రమాదానికి గురై మరణించడం తోటి కార్మికులను ఆవేదనకు గురి చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అరుణాచాలం గిరి ప్రదక్షిణంతో శుభ ఫలితాలు

చిక్కడపల్లి, డిసెంబరు 10 ప్రభాత వార్త: పరమేశ్వరుడు అగ్నిలింగ రూపంలో అతి మహిమాన్విత క్షేత్రం అరుణాచలం అని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య అనుమాండ్ల భూమయ్య అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో స్వర్గీయ వి.గోపాలరావు రచించిన 'అరుణాచల మహత్యము' గ్రంథావిష్కరణ కార్యక్రమం ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగింది.

## పేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



పాఠశాలలకు టాయిలెట్ల క్లీనింగ్ మిషన్లను అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

తార్నాక, డిసెంబర్ 10 ప్రభాతవార్త: పేదలు, మధ్య తరగతి పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలోని జామై ఉస్మానియా ప్రభుత్వ పాఠశాలలో ఏబీవి పౌండేషన్, ఎన్టీపీసీ సహకారంతో ఏర్పాటు చేసిన 100 హై ప్రెషర్ టాయిలెట్ క్లీనింగ్ మిషన్లను మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై 100 స్కూళ్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో స్కూల్ భవనాలను నిర్మిస్తుందని, టీచర్లకు జీతాలు ఇస్తుంది కాని పిల్లల టాయిలెట్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యం ఎందుకు చేస్తుందో తమకు తెలియడంలేదన్నారు. పిల్లల మరుగుదొడ్ల శుభ్రంగా లేకపోవడంతో టీచర్లు విద్యార్థులు ఇబ్బం దులు పడుతున్నారని చెప్పారు. మరుగుదొడ్ల సమస్యను ప్రభుత్వ సీరియస్‌గా తీసుకొని అందుకు సంబంధించిన సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గంలో ఎక్కడ స్కూల్స్‌లల్లో సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా మరుగుదోడ్లను ఆయనే స్వయంగా క్లీనింగ్ మిషన్‌తో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారిని (డిఈఓ) రోహిణి, డిప్యూటీ డీఈఓ ఎస్. చిరంజీవి, ఇంచార్జి హెచ్‌ఎం డి.రమేష్, ఎన్టీపీసీ అధికారి లింగం, బీజేపీ సీనియర్ నాయకులు గౌతమ్ రావు, బిజెపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నాయకులు కనకంట హరి, రాము వర్మ, శారదమల్లేష్, రాజేశ్వర్ రావు, హన్మంత్ ముదిరాజ్, ప్రకాష్‌గౌడ్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి దీపక్, ఓ.యూ ఉద్యోగ సంఘం నాయకులు దీపక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## క్రీడల అభివృద్ధికి కేంద్ర సహకారం

**కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి సతీమణి డాక్టర్ అంజలీ దేవి**



బోయిన్‌పల్లిలో ఖోఖో క్రీడాకారులను అభినందిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి సతీమణి అంజలీ దేవి తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 10 ప్రభాతవార్త: క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి సతీమణి డాక్టర్ అంజలీ దేవి తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, అరిగె రామస్వామి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ మధుసూదన్, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి ఖోఖోపోటీలను శనివారం రెండవ రోజు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని మహారాష్ట్ర జాతీయ ఖోఖో క్రీడాకారిణి డాక్టర్ అంజలీ దేవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్స్ ట్రస్ట్ చైర్మన్ అరిగె మధుసూదన్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపప్రతాప్, భానుక నర్మధ మల్లికార్జున్, హైదరాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు మునిరాజ్, జయరాజ్, గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఆకెళ్ళ, పైడిమర్రిలకు పుట్టగుంట బాలసాహితీ పురస్కారాలు

చిక్కడపల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త: బాలసాహిత్య పరిషత్, శ్రీ త్యాగరాయ గానసభ, పుట్టగుంట సురేశ్‌కుమార్ మెమోరియల ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బాలసాహితీ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ సారస్వత్ పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి భారత్‌భాషాభూషణ్, బాలగోకులం వ్యవస్థాపకురాలు ఆకెళ్ళ వెంకటసుబ్బలక్ష్మి, తెలుగు వర్సిటీ కీర్తిపురస్కారగ్రహీత పైడిమర్రి రామకృష్ణలకు పురస్కారాలను అందించి గౌరవించారు. బాలసాహిత్య పరిషత్ ప్రధాన కార్యదర్శి దాసరి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంచి పుస్తకం ట్రస్టీ కె.సురేశ్, పరిషత్ అధ్యక్షుడు చొక్కాపు వెంకటరమణ, పుట్టగుంట సురేశ్ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు సూరజ్ పుట్టగుంట, సాహితీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'నృత్యభారతి' అనిల శిష్యబృందం ఆధ్వర్యంలో బృందనృత్యాలు, మణిదీప్‌రెడ్డి, జి.రజితచే మేజిక్, ఆనంద సోహనచే మాట్లాడే బొమ్మ, కాపర్తి నరేశ్, వేణుగోపాల్‌చే మిమిక్రి ప్రదర్శనలు అందరిని ఆకట్టుకుంది. కథారచన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఎ.రాఘవి, వి.కీర్తి, జి.మాణిక్‌లకు బహుమతులు అందించారు.

డిశ్చార్జ్ అయితే 100నుంచి 500 ఇవ్వాల్సిందే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం కోసం వెళ్లిన వారు అక్కడ కొన్ని రోజుల పాటు వైద్యం చేయించుకుని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైన సందర్భంలో వీరు ఆగడాలు మరీ ఎక్కువగా ఉంటాయి. ఆ ఆస్పత్రిలో పిల్లలు పుట్టినవారు కానీ, ఇతర సమస్యలతో వచ్చిన వారు కానీ డిశ్చార్జ్ అయ్యారంటే వారి నుంచి రూ.50నుంచి 500వరకు వసూలు చేస్తున్నారు. ఎవరైనా రోగులు మేం డబ్బుల్లేకనే ఇక్కడికి వచ్చాం.. మీకు ఇచ్చుకోలేం అంటే వారికి అడ్డంగా నిలబడి మరీ వాదిస్తూ వసూలు చేస్తున్నారు. దీంతో పేదవారు అయినప్పటికీ వారి ఆగడాలను తట్టుకోలేక అడిగినంత ఇచ్చి వెనుదిరుగుతున్నారు.

## డబ్బులివ్వకపోతే.. 'నోఎంట్రీ'

**నీలోఫర్‌లో పెచ్చుమీరుతున్న చిల్లర దందా**

**చేయి తడిపితేనే రోగులను కలిసే అవకాశం**

**వార్డుబాయ్, సెక్యూరిటీ, కాంట్రాక్ట్ సిబ్బంది ఆగడాలు**

**ఇవ్వకపోతే అనుమతి లేదంటూ వెనక్కి పంపుతున్న వైనం**




హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం సామాన్యుల ఖరీదు మారుతోంది. ధర్మాసత్రుల్లో అన్నీ ఉచితంగా లభించినా అక్కడ పనిచేసే సిబ్బంది మాత్రం తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ రోగులు, రోగి సహాయకులు జేబులు గుల్ల చేస్తున్నారు. ఆస్పత్రుల్లో అడుగు పెట్టినప్పటి నుంచి తిరిగి భయటకు వచ్చేవరకు వేలల్లో ఖర్చవుతుంది. ఇటీవల నీలోఫర్ ఆస్పత్రిలో పరిశీలించగా అందులోని రోగులకు సిబ్బంది వేధింపులు ఎక్కువైనట్లు వెల్లడైంది. అక్కడ పనిచేసే కాంట్రాక్టు సిబ్బంది వేధింపులు భరించలేని రోగులు, రోగుల సహాయకులు అడిగితనంత సమర్పించుకోవాల్సి వస్తుంది. చిల్లర లేదని ఏమాత్రం మారాం చేసినా గొడవకు దిగుతున్నారు. లోపలికి పంపించేది లేదంటూ గెంటివేస్తున్నారు. ఈభాదలు భరించలేక చాలామంది రోగులు, రోగి సహాయకులు ఆస్పత్రి లోనికి వెళ్లేటప్పుడు చిల్లర మార్చుకుని వెళ్తున్నారు. ఈ విషయమంతా ఆసుపత్రి అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. నీలోఫర్ ఆస్పత్రిలో ఇన్ఫోసిస్, నాట్కో బిల్డింగ్‌లో ప్రతి అంతస్తుకు మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. వీటిని శుభ్రం చేయాల్సిన సిబ్బంది పనిని పక్కన పెట్టి దారిలో కూర్చుంటున్నారు. ఎవరైనా మరుగుదొడ్డి ఉపయోగించుకునేందుకు వెళ్తే చాయ్‌కు డబ్బులివ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. లేదంటే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో రోగులను కలిసేందుకు వెళ్లిన వారు వీరి బాధ తట్టుకోలేక రూ.10నుంచి 50వరకు చెల్లించాల్సి వస్తుంది.

**అధికారులు పర్యవేక్షణ కరవు..**

నగరంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు సూపరింటెండెంట్, ఆర్‌ఎంలు, వివిధ స్థాయి అధికారులు నిత్యం ఆసప్రతుల్లోనే ఉన్నప్పటికీ సిబ్బంది తీరును ప్రశ్నించడం లేదు. దీంతో వారు మరింతగా రెచ్చిపోతున్నారు. తాము డబ్బులు కట్టుకోలేకనే ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తే సిబ్బంది తీరుతో ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఇక్కడ అవినీతి రాజ్యమేలు తుందని తెలిసినా నివారించాల్సి అధికారులు నిర్లక్ష్యంతో సిబ్బంది ఆడిందే ఆటగా మారింది. ఉదయాన్నే అధికారులు రైండింగ్‌ల పేరుతో అసుపత్రి అంతా కలియతిరిగినా ఎలాంటి లోపాలు, పరిశీలన, పర్యవేక్షణ కనిపించదు. ఒక గంటపాటు రౌండింగ్ చేస్తే డ్యూటీ అయిపోతుందనుకనే వైద్యులు ఉన్నంత వరకు నీలోఫర్‌లో అవినీతిని అంతమొందించ లేమని పలువురు రోగులు, సహాయకులు పేర్కొంటున్నారు.

## బైరామల్‌గూడలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న ఆర్టీసి బస్సు

**తృటిలో తప్పిన పెను ప్రమాదం**



బస్సు ఢీ కొనడంతో కింద పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

సైదాబాద్, డిసెంబరు 10 ప్రభాతవార్త: ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన ఆర్టీసి బస్సు శనివారం ఉదయం బైరామల్‌గూడ వద్ద రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను ఢీ కొట్టింది. అయితే ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. తృటిలో బస్సులోని ప్రయాణీకులు పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. బస్సు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉంచిన సిమెంట్ దిమ్మె విరిగి రోడ్డుపై పడిపోయింది. దీంతో ట్రాన్మ్‌ఫార్మర్ కూడా కింద పడిపోయింది. అయితే ట్రాన్స్ ఫార్మర్ కింద పడే సమయ ంలో ట్రాన్స్ ఫార్మర్‌లోకి విద్యుత్ సరఫరా చేసే తీగలు తెగి పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సు ఒక్కసారిగా ట్రాన్స్ ఫార్మర్‌ను ఢీ కొనడంతో బస్సులోని ప్రయాణీకులు భయాందోళనలకు గురయ్యారు. అయితే ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. తృటిలో అందరు పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ సంఘటనలో బస్సు ముందు భాగం స్వల్పంగా ధ్వంసమైంది. ఉమెన్స్ కాలేజికి వెళ్తుండగా బైరామల్‌గూడ చౌరాస్త దాటగానే బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో డ్రైవర్ వెంటనే అ ప్రమత్తమై రోడ్డుకు ఎడమవైపు బస్సును తీసుకురాగా ముందున్న కారును బస్సు ఢీకొనే ప్రమాదముందని గుర్తించిన డ్రైవర్ విధిలేని పరిస్థితిలో బస్సును ఇంకొంచెం ఎడమ వైపుకు తిప్పగా పక్కనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని ఆగి పోయింది. ప్రమాద సంఘటన జరిగిన సమయంలో రోడ్డుకు మరో వైపు నుంచి వెళ్తున్న లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి వెంటనే అక్కడకు చేరుకుని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపి వేయించారు. ఇతర శాఖల అధికారులకు సమాచారం అందించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య



దారుణ హత్యకు గురైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాంను పరిశీలిస్తున్న నార్సింగి పోలీసులు

నార్సింగి, డిసెంబర్ 10 ప్రభాతవార్త : గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురైన విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలోని మేకంగడ్డ ప్రాంతంలో ఓ వ్యక్తి హత్యగావింపబడ్డాడని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలానికి వచ్చి ఆధారాలు సేకరించారు. తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇతడిని నమ్మించి గొంతు కోసి హత్య చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. మృతుడు ఎవరనేది తెలిస్తే హంతకులను పట్టుకోవడం సులువు అవుతుందని పోలీసులు పేర్కొంటున్నారు. మేకం గడ్డకు వచ్చి, వెళ్లే ప్రాంతాలలో ఉన్న సీసీ కెమెరాల పుటేజిని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. శనివారం తెల్లవారు ఝామున ఎవరెవరు ఇటు వైపు వచ్చారు? హత్య తరువాత ఎటు వైపు వెళ్లారు? అన్న అంశాలను పోలీసులు సేకరిస్తున్నారు. మృతదేహాంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే నేరుగా పోలీసుస్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని సూచించారు.

## మళ్లీ అవే తప్పిదాలు.. ప్రాక్టీస్‌తోనే ముగింపు

**తొలిరోజు ముగిసిన ఇండియన్ రేసింగ్ లీగ్.. క్వాలిఫైయింగ్ మ్యాచ్ నేటికి వాయిదా**



హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త: భాగ్యనగరంలో మొదటిరోజు ఇండియన్ రేసింగ్ లీగ్ ముగిసింది. గతనెలలో మాదిరిగానే ఈసారి కూడా రేస్ నిర్వాహణలో ఆలస్యం జరిగింది. రేసింగ్ నిర్వాహణలో గందరగోళం నెలకొంది. శనివారం జరగాల్సిన క్వాలిఫైయింగ్ పోటీలు జరపకుండా నిర్వాహకులు రెండు ప్రాక్టీస్ సెషన్లు మాత్రమే నిర్వహించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ఉదయం 11గంటలకు జరగాల్సిన రేసింగ్ పోటీలు మధ్యాహ్నం 3గంటలకు వాయిదా వేశారు. ఆతర్వాత కూడా రేసు జరగకపోవడంతో క్వాలిఫైయింగ్ పోటీలను ఆదివారం నిర్వహించే యోచనలో నిర్వాహకులు ఉన్నట్లు తెలుస్తుంది. మధ్యాహ్నం రేసింగ్ ప్రారంభమైన తర్వాత రెండు కార్లు రేస్ మధ్యలో ఆగిపోవడంతో రెండు సార్లు రెడ్‌ఫ్లాగ్స్ వచ్చాయి. సాంకేతిక కారణలతో స్పోర్ట్స్ కార్లు చాలా ఆలస్యంగా ట్రాక్ ఎక్కాయి. అయితే నేడు జరిగే క్వాలిఫైయింగ్‌పైనే అందరి చూపు ఉంది. రేసింగ్ చూసేందుకు వచ్చే వీక్షకులు మొదటిరోజు తక్కువగానే ఉన్నా.. ఆదివారం పెద్దసంఖ్యలో హాజరవుతారన్న ఆశాభావం నిర్వాహకుల్లో ఉంది.

## ప్రజల అభ్యున్నతికై సిపిఐ పోరాటాలు, ఉద్యమాలు చేపడుతుంది




కటౌట్‌ను ఆవిష్కరిస్తున్న ఇ.టి.నర్సింహా

సైఫాబాద్, డిసెంబరు 10 ప్రభాతవార్త: ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల అభ్యున్నతి కోసం నిరంతం పోరాటాలు చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి. నర్సింహ చెప్పారు. దేశంలో ఫాసిజం యొక్క స్పష్టమైన పెరుగుదల నేపథ్యంలో సిపిఐ 98వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. ఫాసిస్ట్ బిజెపి నేడు ప్రతి రంగంలోనూ నయా ఉదారవాద విధానాలను బలవంతంగా రుద్దు తుందని కమ్యూనిస్టులు ఫాసిస్టు శక్తులను సవాల్ చేయడానికి సమర్ధవంతమైన వ్యూహాలను రూపొందించాలని కోరారు. సిపిఐ 98వ వ్యవస్థాపక దినోత్సవాల సందర్భంగా శనివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద సిపిఐ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార కట్‌అవుట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత 98 సంవత్సరాల్లోనూ, స్వాతంత్ర సమరంలోనూ కీలక పాత్ర పోషించి, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించిన ఘనత సిపిఐదేనని ఉందన్నారు. భారతదేశ సార్వభౌమాదికారం ప్రజా ప్రయోజనాల రక్షణ కోసం , ప్రజా సమస్యలపై ఆనేక పోరాటాలు, ఉద్యమాలు చేసిన ఘనత సిపిఐదేనని ఆయన వివరించారు. ప్రజల జీవనోపాధి, హక్కులు, సంక్షేమంపై ప్రభుత్వాలు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం రక్షణకై బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు.

## సాంస్కృతిక పరిరక్షణలో తల్లిదండ్రులది ప్రధానపాత్ర

**-తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ**




కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ

చిక్కడపల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త: సాంస్కృతిక పరిరక్షణలో తల్లిదండ్రులది ప్రధాన పాత్ర అని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. పిల్లలకు సంస్కృతి అనూచానంగా వస్తున్న కళలు, సాహిత్యం పట్ల అవగాహన కల్పించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని అన్నారు. వారి వల్లనే సంస్కృతి పరిరక్షింపబడి ముందు తరాలకు అందుతుందని అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధానవేదికపై 'వాహిని లలిత కళా సంస్థ' ప్రథమ వార్షికోత్సవ సహస్రాబ్ది కూచిపూడి నృత్య అకాడమి నిర్వహణలో 'నృత్య, సంగీత, వాయిద్య సమ్మిళితంగా గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. నాట్యగురువు వసంత సంధ్య శిష్యబృందం దశావతార శబ్దం ప్రేక్షులను సమ్మోహితులను చేసింది. ఈ సందర్భంగా మామిడి హరికృష్ణ మాట్లాడుతూ సాధారణంగా స్నేహితులుగా తమకు గురించి ఆలోచనలు పంచుకుంటారనని, లక్ష్మిప్రియ, వసంతసంధ్యలు మైత్రి సామాజిక ప్రయోజనమే లక్ష్యంగా వాహిని సంస్థను రూపొందించి కళల ప్రాచుర్యానికి కృషి చేయడం ఆదర్శనీయమని అన్నారు. సీనియర్ పాత్రికేయులు ఎంవిఆర్.శాస్త్రి, వంశీ సంస్థ అధినేత కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, ధనజంయ్, సంగీత గురువు రమాప్రభ, సంస్థ స్థాపకురాలు శంకరమంచి లక్ష్మిప్రియ పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడ రాణించాలి




విజేతలకు సర్టిఫికెట్లు ప్రధానం చేస్తున్న రాజేంద్రనగర్ సిఐ నాగేంద్రబాబు

చార్మినార్, డిసెంబరు 10 ప్రభాతవార్త : రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన అంతర్ కళాశాల క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, వైజ్ఞాన సమ్మేళనం (2022-23) ముగింపు కార్యక్రమం శనివారంతో ముగిసింది. క్రీడలు, ఆటలలో విజయం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడ రాణించాలని తెలిపారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ సిఐ నాగేంద్రబాబు మాట్లాడుతూ క్రీడలు ఆటడం వల్ల విద్యార్థులలో ఒత్తిడిని జయించే సామర్థ్యం కలుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటి డీన్ డాక్టర్ అడప కిరణ్ కుమార్, రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డాక్టర్ పి.ప్రశాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం శ్రీ గురు నృత్యాలయం గురువు శ్రీలక్ష్మి నల్లమోలు శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశా కౌతం, జతిస్వరం, హనుమాన్ చాలిసా, దశావతారం, అన్నమాచార్య కీర్తనలు, తిల్లాన తదితర అంశాలను ఆద్య, ఆరోహి, దీపశిక, హేమ, జస్విత, లాస్య, మధులిక, నిఖిల, మేధ, రుత్విక, శ్రేయ, స్ఫూర్తి తదితర అంశాలను ప్రదర్శించారు.

## బిజెపికి ప్రత్యామ్నాయం బిఆర్‌ఎస్‌పార్టీ



ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసిన టిఆర్ఎస్ నాయకులు ప్రేమ్‌కుమార్‌దూత్,అశీష్‌కుమార్‌యాదవ్‌లు

గోషామహల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త: దేశంలో బిజెపికి ప్రత్యామ్నాయం బిఆర్ఎస్ పార్టీయే అని టిఆర్ఎస్ నాయకులు, గోషామహల్ నియోజకవర్గం టిఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జ్ ప్రేమ్‌కుమార్ దూత్, టిఆర్ఎస్ నాయకులు అశీష్‌కుమార్ యాదవ్‌లు పేర్కొన్నారు. బిఆర్ఎస్ జాతీయ పార్టీని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కెసిఆర్‌ను మర్యాదపూర్వకంగా ప్రేమ్‌కుమార్ దూత్, అశీష్‌కుమార్ యాదవ్‌లు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగుకోట్ల తెలంగాణప్రజల ఆకాంక్షను నెరవేర్చిన తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, జాతీయ రాజకీయాలను శాసించేందుకు భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. బిజెపిని ఢీకొట్టే ఏకైక పార్టీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఏర్పాటు చేసిన బిఆర్ఎస్‌పార్టీ అన్నారు. దేశ రాజకీయాల్లో కెసిఆర్ ప్రధాన పాత్ర పోషించడం ఖాయమన్నారు.

## మానవ హక్కుల ఉల్లంఘన ప్రమాదకరం



నిరుపేద మహిళలలకు బ్లాంకెట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

సైఫాబాద్, డిసెంబరు 10 ప్రభాతవార్త: మానవ హక్కులు అమలు జరిగినప్పుడే ప్రపంచంలో శాంతి భద్రతలు అమలులో కొనసాగుతాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ చెప్పారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే ప్రమాదం ఎర్పడుగుతుందని ప్రపంచంలో ఏక్కడైన అశాంతి తప్పదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు మానవ హక్కుల అమలు కోసం కృషి చేయాల ని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నాడిక్కడ జాతీయ మానవ హక్కుల, సామాజిక న్యాయ సంఘం ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు బ్లాంకెట్స్ ఉచితంగా పంపిణి చేసిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో మానవ హక్కులు అమలు జరుగుతున్నాయని అందువల్లనే శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని స్పష్టం చేశారు. మానవ హక్కుల అమలుకు సిఎం కెసిఆర్ ప్రాధాన్యత కల్పిస్తున్నారని ప్రతి ఒక్కరు మానవ హక్కులపై అవగాహన పెంపోందించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.ఎ.విజయ్ కుమార్, డాక్టర్ కిషన్‌శ్రీకాంత్, సంఘం రాష్ట్ర ఛైర్మన్‌లు డా.సుక్కాడానియేల్, డా.బి.సర్వేందర్, వేణుమాధవ్, శీలం సరస్వతి, అశ్విని రెబెకా తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగుట్టను అభివృద్ధిలో ప్రగతి పథంలో నడిపించేందుకు చర్యలు

### కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్



తుకారాంగేట్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

అడ్డగుట్ట, డిసెంబర్ 10 ప్రభాతవార్త: అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ సహాయ సహకారాలతో అడ్డగుట్ట డివిజన్‌ను అభివృద్ధిలో ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. శనివారం తుకారాంగేట్ రియోపాయింట్ వద్ద లక్షలాది రూపాయల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగాని మాట్లాడుతూ అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను దశాల వారిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, జలమండలి ఏఈ శ్రవంతి, టిఆర్ఎస్ నాయకులు నక్క మధు, వై.సత్తయ్య గౌడ్, ఎల్లయ్య, పొన్నాలరాజు, అమర్, మహ్మద్, మల్లేశ్, శివ శంకర్, నరి ్ంగ్, శ్రీరామ్ నాయక్, మోహన్, దేవయ్య, ప్రవీణ్, నరేశ్, మహేశ్వరీ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మిక సంఘం 65ఏళ్ల ఉద్యమ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త: కల్లుగీత కార్మిక సంఘం 65ఏళ్ళ ఉద్యమ యాత్ర కార్యక్రమం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ వివరించారు. 13న జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎక్సైజ్, యువజన సర్వీసులు,క్రీడల శాఖమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ హాజరావుతారని వివరించారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈ కార్యక్రమానికి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. 1957లో గార్లలో మొదటి రాష్ట్ర మహాసభ జరుపుకుని 65 సంవత్సరాలవుతున్న సందర్భంగా నాటి నుంచి నేటివరకు సంఘం చేసిన పోరాటాలు సాధించిన విజయాలు నెమరవేసుకొని భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని, సంఘంలో పనిచేసే అమరులైన వారి కుటుంబాలకు ఆత్మీయంగా సత్కరించడంతో పాటు నూతన రాష్ట్ర కమిటీ అభినందన కార్యక్రమం, సావనీర్ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.కృష్ణస్వామి, మోదుగుపూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, సోషల్‌మీడియా అడ్వైజర్ గర్వందుల రాజు పెద్ది రాణాప్రతాప్, శినంగారం రాఘవేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

## కల్లూరి భాస్కరం వ్యాసాల సంకలనం

### "గాంధీత్వ నుంచి హిందుత్వ దాకా "పుస్తకావిష్కరణ

హైదరాబాద్, డిసెంబరు 10,ప్రభాతవార్త: కల్లూరి భాస్కరం వ్యాసాల సంకలనం " గాంధీత్వం నుంచి హిందుత్వ దాకా "పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఆవిష్కరణ సభకు బుక్ రీడర్స్ క్లబ్ వ్యవస్థాపకులు శ్రీశైల్‌రెడ్డి అధ్యత వహించగా గౌరవ అతిధులుగా సీనియర్ పాత్రికా రచయిత రామచంద్రమూర్తి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు టంకశాల అశోక్, సీనియర్ పాత్రికేయులు కే.శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా రామచంద్రమూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించగా ..టంకటాల అశోక్ పుస్తకాన్ని గూర్చి వివరించారు. అనంతరం రచయిత కల్లూరి భాస్కరం మాట్లాడుతూ భారతదేశంలో ఉపనిషత్తుల కాలంలో డిబెట్లు జరిగేవని ..అవి ఏకపక్షంగా ఉండేవన్నారు. ఇప్పుడూ అదే జరుగుతుందని ..కానీ భావజాలంపైన డిబెట్ పజరుగుతుందని దీన్నే ఈపుస్తకంలో పొందుపరచానని తెలిపారు. అయితే ఇప్పుడు జరుగుతున్న చర్చలను ఒక్కో కోణంలో చూసే అవకాశం ఉందన్నారు.

## వినియోగదారులు కొత్త బిల్లింగ్ పద్దతికి సహకరించండి

### రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ డిఇ పి.రత్నాకర్‌రావు



చార్మినార్, డిసెంబరు 10 ప్రభాతవార్త : విద్యుత్ వినియోగ దారులు కొత్త బిల్లింగ్ పద్దతికి సహకరించి విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ డిఇ పి.రత్నాకర్‌రావు కోరారు. బిల్లింగ్ జారీ ప్రక్రియ కొత్త ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ సంస్థ ముందుకు వెళ్తున్నదని ఆయన తెలిపారు.శనివారం శివరాంపల్లి విద్యుత్ కార్యాలయలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ పాత బిల్లింగ్ ప్రక్రియ వల్ల అటు వినియోగదారులకు,ఇటు విద్యుత్ సంస్థలకు కొన్ని ఇబ్బందులతో పాటు నష్టం జ రుగుతుందోనని తెలిపారు.యాజమాన్యం ఆధునిక సాంకేతి క పరిజ్ఞానంతో కొత్త బిల్లింగ్ ప్రక్రియను కొనసాగించాలని నిర్ణయించిందని,అందు కోసం విద్యుత్ వినియోగదారులు అన్ని విధాల సహకరించాలని ఆయన కోరారు.పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను వినియోగదారులు వెంటనే చెల్లించాలని లేనిచో నోటీసులు ఇవ్వకుండానే విద్యుత్ కనెక్షన్లు కట్ చేయటం జరుగుతుందని ఆయన తెలియజేశారు.వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి విద్యుత్ సంస్థకు సహకరించాలని డిఇ రత్నాకర్‌రావు విజ్ఞప్తి చేశారు.

### టిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రెండు రోజుల రాష్ట్ర తృతీయ మహాసభలు ప్రారంభం

చిక్కడపల్లి, డిసెంబరు 10ప్రభాతవార్త: ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు విద్యుత్తు బస్సులను ప్రవేశపెట్టాలనే ఆలోచన ప్రభుత్వాలు చేస్తున్నాయని ఆలిండియా రోడ్స్‌ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(ఢిల్లీ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. టిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రెండు రోజుల రాష్ట్ర తృతీయ మహాసభలు శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రారంభమయ్యాయి. టిఎస్ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.రాంచందర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలకుముఖ్యఅతిథిగా ఆలిండియా రోడ్స్‌ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(ఢిల్లీ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పాల్గొనగా వక్తలుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎస్‌డబ్ల్యుఎఫ్ ఏపి విభాగం ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుందరయ్య, టిఎస్ఆర్‌టిసి కార్మికపరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి పాల్గొనగా నివేదికను టిఎస్ఆర్‌టిసి ప్రధాన కార్యదర్శి విఎస్.రావుప్రవేశపెట్టారు.

## పైప్‌లైన్ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులు ప్రారంబిస్తున్న కాలేరు వెంకటేష్, దూసరి లవణ్యశ్రీనివాస్‌గౌడ్

సైఫాబాద్, డిసెంబరు 10 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్‌లోని నేహ్రునగర్ అల్మారిగల్లిలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన పైప్‌లైన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంటకేష్, కార్పోరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ హాజరైనారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిఆర్ఎస్ నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్దఎత్తున ఎత్తున పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు : ఎమ్మెల్యే సాయన్న



మెరుగైన వైద్యానికి సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయన్న తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 10 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలు మృత్యువాత పడకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు మంజూరైన 21.45 లక్షల రూపాయల చెక్కులను శనివారం ఎమ్మెల్యే సాయన్న చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, టిఆర్ఎస్ నాయకులు నివేదిత, పిట్ల నాగేశ్, సదానంద్ గౌడ్, తేజ్‌పాల్, అజయ్, భాస్కర్ ముదిరాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభను కలిగి ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న గోల్కొండ డిప్యూటి డిఈవో బానోతు వెంకటేశ్వర్లు

మెహిదీపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త : విద్యార్థులు చదువుతో పాటు వివిధ సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో కూడా భాగం కావాలని టప్పాచబుత్రా ఇన్‌స్పెక్టర్ సుంకరి శ్రీనివాస్‌రావు అన్నారు. గుడిమల్కాపూర్‌లోని న్యూ ఈడెన్ హైస్కూల్ కల్చరల్, స్పోర్ట్స్ మీట్‌ను పురస్కరించుకుని తాళ్ళగడ్డ లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న శ్రీనివాస్ రావు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను ఉత్సాహపరిచేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభను కలిగి ఉండలన్నారు. గోల్కొండ డిప్యూటి డిఈఓ బానోతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత మారిన కాలానికి అనుగుణంగా విద్యార్థులను విద్యా భోధనలతో పాటు సామాజిక స్పృహ, నూతన అవకాశాలను అందిపుచ్చుకోవడం వంటి రంగాల్లో ముందుండాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.గాలయ్య, డైరెక్టర్ శశిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్‌లో క్రిస్మస్ ఉత్సవాలు




సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్‌లో క్రిస్టమస్ ఉత్సవాలు

చార్మినార్,డిసెంబరు 10 ప్రభాతవార్త : పాతబస్తీ జహానుమాలోని సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్ హైస్కూల్‌లో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో బ్రదర్ యేసు ప్రభహరణ్,సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్ హైస్కూల్ డైరెక్టర్ బ్రదర్ శౌరెడ్డి,బ్రదర్ జయబాలన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### వైభవంగా ఉస్తాద్ గులాం ఆలీఖాన్ జాతీయ సంగీత నృత్యోత్సవాలు

నాంపల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త : సంగీతాంజలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వవిఖ్యాత సంగీతజ్ఞుడు ఉస్తాద్ బడే గులామ్ అలీఖాన్ స్మృత్యర్థం ప్రతీయేటా నిర్వహిస్తున్న రెండురోజుల ఉస్తాద్ గులాం అలీఖాన్ జాతీయ సంగీత, నృత్యోత్సవాలు శనివారం భారతీయ విద్యాభవన్‌లో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆటిజంతో బాధపడే చిన్నారులకు చేయూతనివ్వడానికి నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలలో ఈరోజు ప్రపంచ ప్రఖ్యాత గాయని పద్మభూషణ్ బేగం సర్వీస్ సుల్తానా గాత్రకచ్చేరి ఆహుతులకు వీనులవిందు కావించింది. రెండవ రోజు రేపు మరో ప్రసిద్ధ గాయకుడు పద్మ భూష ణ్ పండిట్ అజయ్ చక్రవర్తి గాత్ర కచ్చేరి జరుగనుంది. ఈ సం దర్భాన్ని పురస్కరించుకొని ఈరోజు మధ్యాహ్నం రవీంద్ర భారతి లోని ప్రివ్యూథియేటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంగీతాంజలి ఫౌండేషన్ ఛైర్మన్ అభిజిత్ బట్టాచార్య డా. అనిల్‌కుంద్రా, పండిట్ అజయ్ చక్రవర్తి కలిసి మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన ఉస్తాద్ గులాం అలీఖాన్ స్మృత్యర్థం ప్రతీయేటా ప్రఖ్యాత కళాకారులతో జాతీయ సంగీత నృత్యోత్సవాలను నిర్వహించడం గర్వంగా ఉందని, ఈ సంవత్సర ఉత్సవాలను ఆటిజం పిల్లల సహాయార్థం నిర్వహిస్తూ వచ్చిన మొత్తాన్ని ఆటిజం ఆశ్రమానికి సహాయంగా అందిస్తున్నట్లు తెలిపారు.

## సతీష్‌చందర్ రచనలు 'సి ఫర్ క్యాస్ట్' పుస్తకం ఆవిష్కరణ

సైఫాబాద్, డిసెంబరు 10 ప్రభాతవార్త: సినీయర్ జర్నలిస్టు, ప్రముఖ రచయిత సతీష్‌చందర్ రచించిన 'సి ఫర్ క్యాస్ట్' అనే పుస్తకాన్ని రాత్రి రవీంద్ర భారతిలో తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ విజయభారతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌చందర్ మాట్లాడుతూ ఇదొక చరిత్రాత్మకమైన పుస్తకమని, కుల, మతం లేని సమాజానికి దారి చూపిస్తుందని చెప్పారు. ఈ దేశంలో కులం, మతం లేకుండా పోవాలనే అనుకునే వారికి దేశంలో 32 ఏళ్ళుగా జరిగిన అన్ని ఘటనలను అబ్జర్వ్ చేసి రాసిన ఈ పుస్తకం ఎంతో ఆదర్శదాయకమైనదన్నారు. మనిషి పుట్టిన నాటి నుంచి చనిపోయేంతవరకు ఎదుర్కొనే అన్ని రకాల వివక్షతలను ఈ పుస్తకంలో వివరించామని చెప్పారు. అంబేద్కర్ చేతిలో ఉన్న పుస్తకంలాంటిదే ఈ పుస్తకమన్నారు. కులం, మతాలపైన యుద్ధం చేయాల్సిందేని ఇందుకు మార్గదర్శి ఈ పుస్తకమేనని చెప్పారు. ఈ పుస్తకాన్ని అవిష్కరించిన విజయభారతి మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని అవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. నారాయణపేట ఎస్పీ చేతన మాట్లాడుతూ అంబేద్కర్ రచనల తరువాత చాలా మందిని ప్రభావితం చేసే రచనలు చేసిన వ్యక్తి సతీష్‌చందర్ అని తెలిపారు. నేడు కులం గురించి మాట్లాడుకోవడమనేది కొంత మందికి గౌరవం, మరికొంతమందికి భయం అని సమాజంలో ఉన్న ఆనేక భేదాల వల్లే ఈ పరిస్థితికి కారణమన్నారు.

### సింగిడి సంస్థ కళలలకు నిలయంగా మారింది

సైఫాబాద్, డిసెంబరు 10 ప్రభాతవార్త: ఢిల్లీకి చెందిన ప్రముఖ నర్తకి మర్యాద కుల్‌శ్రేష్ట (మాయా) కథక్ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అమితంగా అకట్టుకున్నది. సింగిడి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో 4వ సింగిడి పురస్కారాల ప్రదానోత్సవం రవీంద్రభారతిలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె చేసిన నృత్యం అద్భుతంగా ఉందని ప్రేక్షకులు ప్రసంసలు కురిపించారు. బసవతారకం ఇండో అమెకన్ క్యాన్సర్ ఆసుపత్రి అనుబంధ సంస్థ ఇండో అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు జాతీయ సమైక్యత, సమగ్రతను చాటుతూ పలు ప్రదర్శనలు చేశారు. ఈ సభలో తెలంగాణన సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ దీపికారెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు మాట్లాడుతూ సింగిడి సంస్థ చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. సింగిడి సంస్థ కళలకు నిలయంగా మారిందన్నారు. అనంతరం నిర్వహకులు విశ్వకర్మ, సింగిడి అంతర్జాతీయ గౌరవ అధ్యక్షుడు నారాయణస్వామి, సన్యాసి, కిషోర్, విశ్వేశ్వర్ కల్లల పాల్గొన్నారు.

## ప్రైవేట్‌రంగంలో వికలాంగులకు రిజర్వేషన్లు తప్పనిసరిగా ఉండాలి



కార్యక్రమంలో పి.ఉమ్మర్ ఖాన్, డాక్టర్ భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు

చిక్కడపల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు హక్కుల గురించి మాట్లాడుతారని, కాని బాధ్యతల గురించి ఎవరూ మాట్లాడేవారి ఎవరూ లేరని వికలాంగుల పిల్లల హెలెన్ కెల్లర్స్ ఇన్స్టీట్యూట్ ఆఫ్ రీసర్చ్ అండ్ రిహాబిలిటేషన్ వ్యవస్థాపక చైర్మన్ పి.ఉమ్మర్ ఖాన్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా 'భారతదేశంలో వికలాంగుల మానవహక్కుల, విధానాలు-పద్ధతులు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఉమ్మర్ ఖాన్ మాట్లాడుతూ నేడున్న పరిస్థితిలో చాలా మంది విద్యావంతులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకపోవడం బాధాకరమని అన్నారు. దేశంలో 80 నుంచి 90శాతం మంది వికలాంగులు తమ వైకల్యాలు ఉన్నా ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చి ఓటింగ్‌లో పాల్గొంటున్నారని పటాన్ ఉమర్ ఖాన్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'భారతదేశంలో వికలాంగుల మానవహక్కులు, విధానాలు, పద్దతులు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. జాతీయ పౌష్టికాహారా సంస్థ బయోకెమిస్ట్రీ విభాగం అధిపతి డాక్టర్ జి.భానుప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ జీవితంలోని ప్రతి విషయంలోనూ వికలాంగుల పట్ల వివక్షకు కొనసాగుతోందని, ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపులు వికలాంగులకు పెద్దగా ఉపయోపడడంలేదని అన్నారు.

## ఎదుటివారికి సహాయ పడితేనే జీవితానికి అర్థం పరమార్థం : డా. కె.వి.రమణాచారి



పేద బ్రాహ్మణ మహిళలకు నిత్యావసర కెవిఆర్‌కిట్స్, దుప్పట్లు పంపిణీచేస్తున్న రమణాచారి

రవీంద్రభారతి, డిసెంబరు 10 ప్రభాతవార్త : గడ్డి బతుకుతుంది గొడ్డు బతుకుతుంది, మనిషీ జీవిస్తాడు కానీ మనకున్నంతలో ఎదుటి వారికి ఏదో ఒక విధంగా మేలుకలిగేలా సహాయపడితేనే ఈ సృష్టిలో భగవంతుడు మనకు ఇచ్చిన మహోన్నతమైన మానవ జన్మకు అర్థం పరమార్థమని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఛైర్మన్ డా. కె.వి.రమణాచారి అన్నారు. నేటికీ అర్చకులు, బ్రాహ్మణులు ప్రతీరోజూ సంభావన రాకపోతే తులసీ తీర్థంతో ఆయన, మంచి తీర్థంతో ఆమె కుటుంబాలను ఈడ్చుకు వస్తున్నారని ఆవేదన వ్యక్తపరుస్తూ కుటుంబానికి మార్గదర్శకులుగా ఉంటూ సేవలందించే మహిళలకు సహాయమందించాలన్న సదుద్దేశంతో రవికిరణ్, బ్రాహ్మణ సేవావాహిని మహిళా విభాగం సహకారంతో గత 1600రోజులుగా భరత్ ఎంతో సేవాభావంతో నిర్వహిస్తున్న యజ్ఞతుల్యమైన ఈ కార్యక్రమంలో వందకుపైగా పేదబ్రాహ్మణ మహిళలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లను ముఖ్యఅతిథి డా. కె.వి.రమణాచారి బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ, సత్యనారాయణ, భరత్, రవికిరణ్, రాధమ్మ, లక్ష్మణాచారి తదితర అతిథుల చేతులమీదుగా రెడ్‌హిల్స్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వాహకుడు భరత్ సహకారంతో తయారు చేయించిన నిత్యావసర వస్తువుల కెవిఆర్ కిట్స్, దుప్పట్లు శనివారం ఉదయం పంపిణీచేస్తూ సమాజంలోని పేదవారి కోసం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న సేవామూర్తులకు తనవంతు సహాయసహకారాలు ఉంటాయని రమణాచారి అభయమిచ్చారు. ఏదియేమైనా బ్రాహ్మణులు తమ పిల్లలను బాగా చదివించాలని, తెలంగాణ ప్రభుత్వ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు అందిస్తున్న వివిధ పథకాలను అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని, తద్వారా మహిళలు సౌభాగ్య, భాగ్యవతులు కావాలని ఆకాంక్షించారు.

## ఆకట్టుకున్న చిన్నారుల "మాక్ రైతుబజార్"

### విక్రేతలుగా సందడి చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు



రైతుల వేశాధారణలో పాఠశాల విద్యార్థులు

హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త: పాఠశాల చిన్నారులు కొద్దిసేపు కూరగాయల విక్రయదారులుగా మారి వాటిలోని పౌష్టిక విలువలను చాటిచెప్పారు. రైతుబజారు తలపించే విధంగా అన్ని రకాల పండ్లు, కూరగాయాలను ప్రదర్శించడమే కాకుండా వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ విక్రయించిన తీరు అబ్బురపరిచింది. అచ్చం అమ్మకందారులు ఆహార్యంలో ..బేరమాడే కొనుగోలు దారులను సైతం మురిపించి మరిపించారు. ధరంకరం రోడ్‌లోని ఐరిస్‌ఫ్లోరెట్స్ పాఠశాలలో శనివారం చిన్నారులు నిర్వహించిన మాక్ రైతు బజార్ ఆకట్టుకోవడంతోపాటు ఆలోచింపజేసింది. పిల్లలు తమ ఇంటి నుంచి తెచ్చిన కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో స్టాల్‌ను ఏర్పాటు చేసి మార్కెట్‌గా మార్చారు. కొనుగోలు దారులుగా వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలు కూరగాయాలు గురించి చెబుతుంటే మురిసిపోయారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ విజీతా మాథుర్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే కూరగాయలు, పండ్లసాగు, వాటతిని విక్రయించే తీరు, వాటి ద్వారా అందే పౌష్టికాహారం వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు మాక్ రైతుబజార్ నిర్వహించడం జరిగిందన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పడం కంటే నేరుగా చిన్నారులచే ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా తరగతని విషయ పరిజ్ఞానం అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అరవింద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'బాలు-వంశీ-శుభోదయం' పురస్కారాలు-2022' ప్రదానం

చిక్కడపల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త: వంశీ ఇంటర్నేషనల్(ఇండియా), లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో 'బాలు-వంశీ-శుభో దయం' పురస్కారాలు-2022' ప్రదానోత్సవ కార్యక్రమం 15న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహిస్తున్నట్లు వంశీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవవి, మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ, కన్వీనర్ ప్రసన్నలక్ష్మి వివరించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ సురభివాణిదేవి హాజరై సినీ సంగీత దర్శకులు ఆర్‌పి.పట్నాయక్, గాయకులు కె.రామాచారి, కళాసామ్రాట్ పొత్తూరి రంగారావుకు ఈ పురస్కారాలు అందజేయనున్నట్లు వివరించారు. వంశీ సంస్థల అధినేత కళాబ్రహ్మ డాక్టర్ వంశీరామరాజు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో తానా అధ్యక్షుడు అంజయ్యచౌదరీ లావు, సినీ దర్శకులఉ రేలంగి నరసింహారావు, చంద్ర సిద్దార్థ,సీల్‌వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావు, శుభోధయం గ్రూప్ అధినేత లక్ష్మీప్రసన్న కలపటపు, అలేఖ్య హోమ్స్ అధినేత కుర్రా శ్రీనాథ్ తదితరులు పాల్గొంటారన్నారు. పద్మభూషణ్ పురస్కారగ్రహీత డాక్టర్ ఎస్‌పి.బాలసుబ్రహ్మణ్యం తొలి పాటకు 56 వసంతాలు' సందర్భంగా 'బాలు పాటకు పట్టాభిషేకం-ప్రారంభం రామాచారి శిష్యబృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, డిసెంబరు 10 ప్రభాతవార్త : కాటేదన్,శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ల పరి ధులలో విద్యుత్ మరమ్మతులు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు గగన్‌పహాడ్ విద్యుత్ సబ్ డివిజన్ ఎడిఇ ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు.నేషనల్ పోలీస్ అకాడమీ 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలియజేశారు. ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ,మధుబన్ కాలనీ,పద్మశాలి పురం,ఆప్కో కాలనీ,రామ్ రామ్ స్కూల్,శివాజీనగర్,పారిశ్రామిక ప్రాంతం,జల్‌పల్లి,వెంకటేశ్వర కాలనీ,నేతాజీనగర్, చర్చి వీధి ప్రాంతాలలో ఆదివారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు.

## మధురగాన విదుషీమణి ఎస్పీ శైలజ

చిక్కడపల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త: నాంపల్లి నాంపల్లిస్టేషన్ కాడ రాజలింగో..రాజా లింగా..జానపద పాటలు అలవోకగా పాడగల ఎస్పీ.శైలజ శాస్త్రీయ గీతాలను స్వరబంధురంగా ఆలపించే మధురగాన విదుషీమణి అని ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. రాగరాగిణి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అమరగాయకులు పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు శతజయంతి సందర్భంగా ప్రముఖ సినీ నేపథ్య గాయనీ ఎస్‌పి.శైలజకు 'ఘంటసాల శతజయంతి పురస్కారం' ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి, ఎం.వి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, సినీనటులు శుభలేఖ సుధాకర్ హాజరై ఈ పురస్కారాన్ని అందించారు. సభను ప్రముఖ గాయనీ, భీమన్న సాహితీ నిధి అధినేత్రి హైమావతి భీమన్న ప్రారంభించగా. విశిష్ట అతిథులుగా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్.అంజయ్య, జాతీయ మానవహక్కులు, యాంటీ క్రైం కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ ఆర్.రామమూర్తి నాయుడు, ప్రముఖ సినీ పరిశోధకులు సంజయ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు. 'పాటే మంత్రము' ఘంటసాల, ఎస్‌పి.శైలజ పాడిన పాటలతో 'సినీ గీత విభావరి' కార్యక్రమంలో గాయనీ గాయకులు ఎం.వి.రమణకుమారి, శశిరేఖ, హిమజ, శశికాంతి,ఎన్.బి.ఖాసిమ్ గానం చేశారు.

# అభివృద్ధిలో అగ్రగామిగా ఎల్‌బినగర్ నియోజకవర్గం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ సుజాతానాయక్ తదితరులు

**వనస్థలిపురం, డిసెంబరు 10 ప్రభాతవార్త :** రానున్న రోజుల్లో ఎల్‌బినగర్ నియోజకవర్గం రూపు రేఖలు మారి, అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. హస్తినాపురం డివిజన్‌లో రూ. 11.34 కోట్లతో జరుగనున్న అభివృద్ధి పనులకు కార్పొరేటర్ సుజాతానాయక్‌తో కలిసి శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ కాలనీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎల్‌బినగర్ రింగు రోడ్డులో కోట్ల రూపాయలో జరిగిన ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జిలు తదితర అభివృద్ధి పనులు దేశానికే తలమానికంగా నిలుస్తాయన్నారు. రానున్నరోజుల్లో ఎల్‌బినగర్ నియోజకవర్గ రూపు రేఖలు మారి సిగ్నల్స్ లేని వ్యవస్థగా తయారవుతుందన్నారు. ఈ సందర్భంగా హస్తినాపురం డివిజన్‌లోని పలు కాలనీలలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ శంకుస్థాపనలు చేసారు. కార్యక్రమంలో నాయకులు గజ్జల మధుసూదన్ రెడ్డి, డివిజన్‌అధ్యక్షుడు సత్యంచారి, నారగోని శ్రీనివాస్ యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, రఘుమారెడ్డి, పల్లం శ్రీనివాస్, డిఇ కనకయ్య, ఎఇ హేమునాయక్, శ్రీరమణ కాలనీ ప్రతినిధులు దశరరథరామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎ.రవీందర్‌నాయక్, లింగన్న పంతులు, అరుణ్‌రాజ్, గోపాల్‌నాయక్, మల్లేష్, ఎల్లారెడ్డి, ఎం.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీవాసులనుండి ఫిర్యాదులు రాకుండా పని చేయాలి : పవన్



కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :** కాలనీవాసుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పారిశుద్ధ కార్మికులు పనిచేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ సూచించారు. శనివారం కొత్తపేటలో స్వచ్ ఆటో సిబ్బందితో కార్పొరేటర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిసరాలను ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని కాలనీవాసుల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్వచ్ఆటో సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ స్వచ్ఛ్ డివిజన్‌గా తీర్చిదిద్దాలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహనకల్పించి ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని, కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో డిఈ నీలిమ, బుచ్చయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ వార్డులో సిసి కెమెరాల ప్రారంభోత్సవం : పారిజాత



సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతనర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 31వ డివిజన్ సాయి బాలాజీనగర్ ఫేజ్-2 కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ప్రారంభోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ పారిజాత కాలనీవాసులతో కలిసి సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్, కాలనీవాసులు రాముగౌడ్, మల్లికార్జున శర్మ, కృష్ణ కులకర్ణి, శ్రీహరి, పరమేష్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకోవాలి : ప్రిన్సిపల్ మధుసూదన్



విద్యార్థులను అభినందిస్తున్న డీన్‌లు రవన్‌కుమార్, సుమిలారెడ్డి

**మలక్‌పేట, డిసెంబరు 10 ప్రభాతవార్త :** దిల్‌సుక్‌నగర్ ఐడియల్ డిగ్రీ మహిళ కళాశాల ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ మధుసూదన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకోవాలని, ప్రస్తుత పోటీ యుగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలను చేపట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్ డీన్స్ రవి కుమార్, సుమిలారెడ్డి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్‌వి నూతన కమిటీ నియామకం




నూతన కమిటీ సభ్యులతో పాండుగౌడ్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :** బిఆర్‌ఎస్‌వి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాండుగౌడ్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని శ్రీగాయత్రి కళాశాలలో బిఆర్‌ఎస్వి నూతన కమిటీ నియామకం శనివారం జరిగింది. శ్రీగాయత్రి కళాశాల అధ్యక్షునిగా అనురాగ్, ఉపాధ్యక్షుడుగా అనురూప్, సెక్రటరీగా రాకేష్, ప్రధానకార్యదర్శిగా శేఖర్, సభ్యులుగా శుభం, నిఖిల్, విజయ రెడ్డి, పృథ్వి, సాయికమల్, వెంకటేష్, సాయిరాం, క్రిష్, శివ నియామకమైనట్లు పాండుగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ కార్యదర్శి కిరణ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నవీన్‌గౌడ్ తాడిపల్లి పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు




చిలుకానగర్‌లో జరిగిన ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** ఉప్పల్ ఏరియా పాస్టర్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్ ప్యామిలీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రిస్మస్ సంబరాలు చేసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ అన్ని కులాలకు తగు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. క్రిస్టియన్ సోదరులకు ప్రభుత్వం నుంచి తగు చేయూత అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్దనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ ఏ జోసెఫ్, రెవ.జి.కె. బాబు, పోలోషిప్ రెవ.జి.ప్రభాకర్, వర్కింగ్ ప్రసిడెంట్ మనోహర్, బి.వరప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ, అఖిలభారత ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ టీటీడీపీ అధ్యక్షుడిగా నియామకమైన సందర్భంగా ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి కట్ట కృష్ణముదిరాజ్ తెలిపారు. ఆత్మీయ సమ్మేళన సభకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 150డివిజన్లకు చెందిన ముదిరాజ్ కులబాంధవులు పెద్దఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున సభకు రావాలని కృష్ణా ముదిరాజ్‌తో పాటు పి.శంకర్ ముదిరాజ్, పి.శ్రీనివాస్‌ముదిరాజ్ కోరారు.

## ప్రజలకు ఏ కష్టం వచ్చిన అందుబాటులో ఉంటాం : కౌన్సిలర్ కరాడి శ్రీలత



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న రాజేందర్ తదితరులు

**తుర్కయంజాల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ బిజెపి ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ కరాడి శ్రీలత అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. తుర్కయంజాల్ నివాసి ఆలకుంట స్వప్న అనారోగ్యం బారినపడటంతో కౌన్సిలర్ బిజెపి ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలత అనిల్‌కుమార్‌ను సంప్రదించడంతో విషయాన్ని మాజీ మంత్రి ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వ సహకారం ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కు ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీలత మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టం వచ్చిన అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నరసింహరెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకులు బస్వా పాపయ్యగౌడ్, ఆలకుంట గోపాల్, పండుగల రాము, చింతల కావ్య, గొట్టె స్వర్ణలత, గొట్టె యోజిత్ తుల్లా శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మలక్‌పేట రేవంత్‌రెడ్డి యువసేన అధ్యక్షుడిగా తమ్మిగొండ రాజు

**మలక్‌పేట, డిసెంబరు 10 ప్రభాతవార్త :** మలక్‌పేట రేవంత్ రెడ్డి యువసేన అధ్యక్షుడిగా తమి మ్మగొండ రాజు, ప్రధాన కార్యదర్శిగా బుగుడల విష్వదేవ్, ఉపాధ్యక్షుడిగా నందిపాటి నాని, కార్యదర్శిగా శివలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఓల్డ్ మలక్‌పేట కాంగ్రెస్ కార్యాలయంలో గ్రేటర్ కాంగ్రెస్ ఓబిసి సెల్ వైస్ ఛైర్మన్ చౌకి రవికుమార్, ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్ ఆధ్వ్యంలో జరిగిన సమావేశంలో వారిని ఎనుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మలక్‌పేట కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నరేందర్ ముదిరాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ ఆవిర్భావంతో నాయకుల సంబరాలు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :** టిఆర్‌ఎస్ పార్టీని బీఆర్‌ఎస్ పార్టీగా ఏర్పాటుచేసిన సందర్భంగా పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కెసిఆర్, ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి అభినందనలు తెలియజేస్తూ గడ్డిఅన్నారం డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ పార్టీని స్వాగతిస్తూ పటాకులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు శ్రీశైలంయాదవ్, వర్కింగ్‌ప్రెసిడెంట్ రమణరెడ్డి, సన్నీయాదవ్, రవీందర్‌రెడ్డి, మహిళ అధ్యక్షురాలు మల్లిక, విజయలక్ష్మి, పరమేశ్వరి, పద్మ, నాగమణి, హసీనా, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి



కుట్టుమిషన్లను మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి తదితరులు

**నాచారం, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బేతిసుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. టీఎస్‌సీసీడీసీ, ప్రొఫెషన్ డిజైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో మూడు నెలలుగా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ పొందిన పలువురు ఎస్సీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లను అందజేసి మాట్లాడుతూ మహిళలుఅభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. పావలా వడ్డీ, ముద్ర లోన్, దళిత బంధు వంటి పథకాల ద్వార ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మహిళలకు శిక్షణనిచ్చిన ఫాషన్ డైరెక్టర్ దేరం ఉషా, అభయ ఎన్జీవో సెక్రెటరీ సుచిత్రారెడ్డిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అభయ కౌన్సిలర్ అండ్ బీఆర్‌ఎస్ నేత అనుముల నర్సింహ్మారెడ్డి, నాచారం ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, నాయకులు మహిపాల్‌రెడ్డి, కిరణ్, వై.మల్లేష్, టీచర్లు శేఖర్, పావని, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి కృషి : బలాల



మూసానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల, అబ్రార్ తదితరులు

**మలక్‌పేట, డిసెంబరు 10 ప్రభాతవార్త :** ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులోఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అజంపుర డివిజన్ మూసానగర్ వద్ద ఏర్పాటు చేసిన ఎంఐఎం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దశలవారిగా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని, అదేవిధంగా మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్రార్, అలీం తదితరులు పాల్గొన్నారు.

## బాటసింగారంలోని హ్యూమనిస్ట్ సెంటర్‌లో మూఢ నమ్మకాలు, పలు అంశాలపై అవగాహన తరగతులు



అవగాహన తరగతుల్లో ప్రసంగిస్తున్న జడ్జి సుదర్శన్ తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** బాటసింగారంలోని హ్యూమనిస్ట్ సెంటర్‌లో మూఢ నమ్మకాలు, పలు అంశాలపై అవగాహన తరగతులు జరిగాయి. వికారాబాద్ జిల్లా జడ్జి కె.సుదర్శన్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులతో పాటు విద్యావంతులు కూడా మూఢ నమ్మకాలలో ఉంటున్నారని, ప్రజల్లో విజ్ఞాన ప్రచారం పెరగటానికి మానవ వికాస వేదిక లాంటి సంస్థల అవసరం చాలా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నాటక నుంచి వచ్చిన భారత హేతువాద సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ నరేంద్రనాయక్ దేశవ్యాప్తంగా వైద్యం పేరుతో అమలవుతున్న అశాస్త్రీయ విధానాలు ప్రజలను ఎలా పీడిస్తున్నాయో తెలిపారు. వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ దేశవ్యాప్తంగా హిందూత్వభావజాలం ప్రమాదకరంగా మారి, ప్రజాస్వామ్య హక్కులను అణచి వేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. 'అంకురం' అనే బాలల సంస్థ వ్యవస్థాపకురాలు సుమిత్ర బాలికలపై జరుగుతున్న పాశవిక అత్యాచారాలను అరికట్టేందుకు మానవీయ విలువల్లో రావాల్సిన మార్పులను వివరించారు. మానవ వికాస వేదిక కేంద్ర కమిటీ అధ్యక్షుడు సాంబశివరావు రామాయణం- చారిత్రక పరిశీలన అనే అంశంపై మాట్లాడారు. ఈ సమావేశం లో మానవ వికాస వేదిక నాయకులు ఎం ఎస్ ఎన్ మూర్తి, తుమ్మా భాస్కర్, రొంటాల బుచ్చయ్య, ఎం ఎన్.గుప్తా, అనంత రామయ్య, రాజేశ్వరి, శ్రీకాంత్, లీల, కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఎన్నికైన నందిహిల్స్ ఫేజ్-2 కాలనీ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన శివపార్వతి, నర్సింహ

**సరూర్‌నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 9వ డివిజన్ నందిహిల్స్ ఫేజ్-2 కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కాలనీ సర్వసభ్య సమావేశంలో కమిటీని కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా గిరిమోని సిద్దప్పముదిరాజ్, కార్యదర్శిగా బి.యాదగిరిరెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.సురేష్‌గుప్త, ఎల్.సాయిప్రసాద్, జి.గోపాల్ యాదవ్, కోశాధికారిగా కె.అంతయ్య, సహాయ కోశాధికారిగా ఆర్. గణేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఈ.సత్యంగౌడ్, అధికార ప్రతినిధిగా ఈ.ఈశ్వర్‌గుప్త, ఆడిటర్‌గా ఎ.రమేష్‌బాబు, మహిళా ప్రతినిధులుగా ఎన్.సరోజీనీ నాయక్, కె.అనితారెడ్డి, పి.తిరుపతమ్మ, ఇతర సభ్యులుగా తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాలనీ పార్కులో ముఖ్య అతిథులుగా హాజరైన కార్పొరేటర్లు పెండ్యాల శివపార్వతి నర్సింహ, పెండ్యాల నర్సింహల సమక్షంలో నూతన కార్యవర్గానికి ఎన్నికైన వారు ప్రమాణ స్వీకారం చేశారు.

# బాధిత కుటుంబానికి సత్వర న్యాయం జరిగేలా చూస్తామని హామీ : ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



కిడ్నాప్‌కు గురైన అమ్మాయి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపల్ మన్నెగూడ సిరి టౌన్ షిప్‌లో కిడ్నాప్‌కు గురైన వైశాలి కుటుంబ సభ్యులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బాధిత కుటుంబానికి సత్వర న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. నిందితుడు నవీన్‌రెడ్డిని పోలీసులఅదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వైశాలి కిడ్నాప్ ఘటన దురదృష్టకరమని, ఇంటిమీదికివచ్చి దాడి చేసి కిడ్నాప్ చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. నవీన్‌రెడ్డి చేసిన సైకోఆలోచన తప్పని, నవీన్‌రెడ్డితోపాటు ఇందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. దుండగుల జరిపిన దాడిలో కొంతమందికి గాయాలయ్యాయని తెలిపారు. ఘటనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నామన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉండి సత్వర న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అదేవిధంగా దాడికి గురైన గాయపడ్డ శేఖర్‌రెడ్డిని కూడా పరామర్శించారు ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రంగారెడ్డి జిల్లా రైతుబంధు కోఆర్డినేటర్ వంగేటి లక్ష్మారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, మార్కెట్ మాజీ డైరెక్టర్ కందాడ ముత్యంరెడ్డి, రామావత్ కళ్యాణ్‌నాయక్, నాయకులు కందాడ లక్ష్మారెడ్డి, వేముల అమరేందర్‌రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి



ఎమ్మెల్యే బేతి, నరేష్ సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరుతున్న నేతలు

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** బిఆర్‌ఎస్ పార్టీతోనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం చిలుకానగర్ డివిజన్‌కు చెందిన పలుపార్టీల నేతలు చిలుకానగర్ బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పిట్టల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో సిఎం కెసిఆర్ చేపడుతున్న అభివృద్ధిపనులు చూసి పలువురు పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. పార్టీ కోంస పనిచేసే వారికి తగు న్యాయం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా నాయిబ్రహ్మణ సంఘం నేతలతోపాటు, వివిధ పార్టీల నేతలు బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు, గరిక సుధాకర్, రవీందర్‌రెడ్డి, కొంపల్లి రవీందర్, చేర్యాల శ్రీనివాస్, నర్సింగ్‌రావు, రాజ్‌కుమార్, సకినాల ప్రసాద్, సుధాకర్, పరమేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు : జంగం శ్వేత



గుర్రపు డెక్క తొలగింపును పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ చెరువులోని గుర్రపు డెక్క తొలగింపు పనులను ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి పర్యవేక్షించారు. సరూర్‌నగర్ చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోవడం వల్ల దోమలు వా వ్యాప్తి చెందుతున్నాయని పరిసర కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించిన కార్పొరేటర్ గత రెండు రోజులుగా ఎంటమాలజి సిబ్బంది చే చెరువులోని గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపడుతున్నారు. శనివారం పనులను పర్యవేక్షించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు.

## ఫ్లైఓవర్ల నిర్మాణంతో భవన యజమానులకు తీవ్ర నష్టం



ఉప్పల్ మేకల భారతిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న నాగోల్ రోడ్డు ఫ్లైఓవర్ బాధితులు, ఇతర నాయకులు

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ కళాశాల నుంచి నాగోల్ వరకు కొత్తగా నిర్మించతలపెట్టిన ఫ్లై ఓవర్‌తో భవన యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ మేకల భారతి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో పలువురు భవన యజమానులు సమావేశమై పలు అంశాలు చర్చించారు. ఇప్పటికే ఉప్పల్‌చౌరస్తాలో స్కైవాక్, ఎలివేటెడ్ కారిడార్, మెట్రోస్టేషన్‌లతో పలువురు భవన యజమానులు తీవ్రంగా నష్టపోయారని, మళ్లీ భవన యజమానులకు నోటీసులు జారీచేశారని పేర్కొన్నారు. తమస్థలాలకు ఎంత వరకు తొలగిస్తారనే విషయంపై స్పష్టత ఇవ్వడం లేదని, భవన యజమానులంతా త్వరలోనే భూసేకరణ స్పెషల్ డిప్యూటి కలెక్టర్, టౌన్‌ప్లానింగ్ అధికారులను కలిసి తమ సమస్యలు విన్నవిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భవన యజమానులు మేకల మధుసూధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, డా.ప్రసాద్, చర్ల రామిరెడ్డి, మేకల రామకృష్ణారెడ్డి, కిషోర్, రమేష్; బాబు, వెంకటయ్య, సంజీవశర్మ, విజయ్‌కుమార్, ధన్‌రాజ్, అశోక్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలకు బయలు దేరిన అయ్యప్ప స్వాములు

**రామంతాపూర్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** రామంతాపూర్‌కు చెందిన పలువురు అయ్యప్ప స్వాములు శనివారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్ ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమంలో అయ్యప్పగురుస్వామి రేవు నరసింహాఆధ్వర్యంలో స్వాములు సతీష్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, రేవు మల్లేష్, జితుస్వామి తదితరులు శబరిమలకు వెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రతి ఏటా రామంతాపూర్ నుంచి వేలాది మంది అయ్యప్పస్వాములు తరలివెళుతున్నారన్నారు. అయ్యప్ప భక్తులకు తగు చేయూత అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వంగాల సంతోష్‌గుప్త, దయానందరెడ్డి, పడిగం నగేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మురికికూపంగా కుమ్మరికుంట



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తదితరులు

**హయత్‌నగర్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కుమ్మరికుంట మురుగునీటితో నిండిపోయిందని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని సామానగర్, పద్మావతికాలనీలలో ధ్వంసమైన డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను ఆయన శనివారం పరిశీలించారు. సామానగర్‌లో మ్యాన్‌హోల్ మరమ్మతులు చేయిస్తున్న అధికారులతో ఆయన మాట్లాడుతూ మ్యాన్‌హోళ్లు ధ్వంసమై నెలరోజులు కావస్తున్నా వాటికి మరమ్మతులు చేయించలేన్నారు. దీంతో మురుగునీరు కుమ్మరికుంటలోకి చేరి దుర్గంధభరితంగా మారిందన్నారు. కాలనీవాసులు దుర్వాసన కారణంగా ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. అధికారులు ఎప్పటికపుడు స్పందించి మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు నిర్వహించి మురుగునీరు కుమ్మరికుంటలోకి చేరకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బి జీఎం వినోద్, డీజీఎం వేణుగోపాల్, మేనేజర్ వాహిని పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బిఎల్‌ఆర్ ట్రస్ట్ చేయూత



ఉపాధ్యాయులకు వేతనాలు అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు బిఎల్‌ఆర్ ట్రస్ట్ కృషి చేస్తుందని బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ మేరకు చిలుకానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులకు గౌరవ వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న కారణంగా ప్రత్యేక శ్రద్ద తీసుకుని నిరుద్యోగులతో విద్యాబోధన చేయిస్తున్నామన్నారు. చిలుకానగర్, మల్లాపూర్, నాచారంలోని పాఠశాలలోని విద్యార్థులకు కూడా విద్యాబోధన చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు వైద్య విద్యలో సీటు సాధించారని, వారికి ఐదున్నర సంవత్సరాల పీజులు చెల్లించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మాస శేఖర్, కొండల్‌రెడ్డి, జగన్, మహేందర్, యాదగిరి, చింటూ, సుధాకర్, రఫీ, నరసింహ, రవి, రాజిరెడ్డి, సుభద్ర, సత్యవతి, కనకతార ప్రధానోపాధ్యాయులు ఆది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## టిపిసిసిలో డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి చోటు

**సరూర్‌నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన చల్లా నర్సింహారెడ్డి నియమితులయ్యారు. బాలాపూర్ మండలం మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ గ్రామానికి చెందిన చల్లా నర్సింహారెడ్డి మూడు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌కు సేవలందిస్తూ ప్రజా ప్రతినిధిగా గతంలో జిల్లెలగూడ ఉప సర్పంచ్‌గా, పర్సన్ ఇంఛార్జిగా, సరూర్‌నగర్ జడ్పీటిసిగా పని చేశారు. ఆయన సేవలను విస్తృతం చేయాలనే ఉద్దేశ్యంతో పార్టీ అధిష్టానవర్గం టిపిసిసిలో చోటు కల్పించింది. దీంతో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అమోదించిన తెలంగాణకు సంబంధించిన కాంగ్రెస్ పదవుల భర్తీలో చల్లా నర్సింహారెడ్డికి టిపిసిసి ప్రధాన కార్యదర్శి పదవి లభించింది.

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పరిశుభ్రత



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేతి, సిఐలు పార్థసారధి, మక్బూల్ జానీ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్ చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి పచ్చదనం పరిశీలించి పోలీసులకు తగు సూచనలు చేశారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం వెంటనే పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐలు పార్ధసారధి, మక్బూల్‌జానీ, ఎస్ఐ చిరంజీవి, బిఆర్‌ఎస్ నాయకులు గడ్డం రవికుమార్, మస్కు సుధాకర్, నాయబు వెంకట్రావ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.